
ఆరోజు అతని జీవితంలో మరచిపోలేని రోజు. చిన్నప్పట్నుంచీ అతను పడ్డ కష్టాలు, కన్నీళ్లు మరచిపోయి, సంతోషాన్ని రంగరించుకున్న రోజు. అతని చేదు జీవితం తీపిని సంతరించుకున్న రోజు. ఒంటరి శిల లాంటి అతని కఠోర జీవితంలో ఓ సజీవ శిల్పం సాక్షాత్కరించిన రోజు. ఓ తపస్సులా చదువుల నావపై పయనించే సమయంలో ఓ తుఫాన్ని సృష్టించి, తన జీవితంలో అల్లకల్లోలాన్ని సృష్టించిన ఆమే, అటుతర్వాత ఉద్యోగాన్వేషణలో పడి కొట్టుకుపోతూ నిరాశా నిస్పృహలతో నిండిన సమయంలో ఉద్యోగార్థిగా వెళ్లిన తనని శల్యపరీక్షలకు గురిచేసి తీవ్రంగా అవమానించింది. అయితే అదంతా పైపైన తెచ్చిపెట్టుకున్న కాఠిన్యమే అని, మనసంతా వెన్నముద్ద అని అర్థమైందతనికి. అంతేనా? అతని చిత్ర కళాభివృద్ధికి దోహదపడే ఓ చిత్రమైన ఉద్యోగాన్ని సృష్టించి తన జీవిత పథ నిర్దేశాన్ని చేసిందామె. అంతేకాదు, తన జీవిత భాగస్వామ్యాన్నీ అందుకొమ్మని ఆహ్వానించింది. ఇంతకన్నా జీవితంలో ఆనందం ఇంకేముంటుంది? మాతృ ప్రేమ లవలేశమైనా ఎరుగని అతను- ఆమె కొసరి కొసరి ప్రేమతో వడ్డించిన పదార్థాలను తన జీవితానికి సరిపడా తినేలా చేసింది. ఆ ఆనందంలో, ఆ సంతోషంలో, ఆ సంతృప్తిలో వెల్లువెత్తి కొట్టుకుపోతూ, దాన్ని తనివితీరా అనుభవించాలని భావించి, ఆమె కారులో డ్రాప్ చేస్తానన్నా వినక ఒంటరిగా రిక్షాలో బయలుదేరాడు ఇంటికి.

అయితే అంతటి ఆ సంతోష సమయంలో ఎక్కడో అసంతృప్తి, ఏ మూలో చెప్పలేని వెలితి, ఏమిటది? ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. ఈ ఆనందం క్షణికమేనా? ఈ సంతోషం జీవితాంతం నిలిచేది కాదా? భయం పట్టుకుందతనికి. రిక్షా కుదుపులకు లోనై, పక్కనున్న చెక్కను గట్టిగా పట్టుకున్నాడు. అప్పుడు గుర్తొచ్చాడతనికి తమ్ముడు సుధాకర్! సుధాకర్ కేవలం తన తమ్ముడేనా? తన ఆరో ప్రాణం... తనకు ఈ ప్రపంచంలో రక్తసంబంధం గల ఒకే ఒక వ్యక్తి... ఎలా మర్చిపోయాడు తను వాణ్ణి? ఎంత కాలమైంది వాణ్ణి చూసి! ఒక్కసారిగా అతని మనసంతా గజిబిజిగా తయారై అతలాకుతలమైంది తమ్ముడి స్మృతులతో!



# తమ్ముడి ఉత్తరం

- ఎన్.వి.యస్.నాగభూషణాచార్యులు

ఉగాది పోటీలో ఎంపికైన కథ

★ ★ ★

తను అప్పుడు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సుధాకర్ అప్పుడు నాలుగో తరగతి. ఆరోజు...

సాయంకాలం అయిదయింది. బడినుండి సరాసరి ఇంటికొచ్చి తను హోం వర్కు చేసుకుంటున్నాడు. చేసుకుంటున్నాడన్న మాటే గాని మాటిమాటికీ గుమ్మం వంకే చూస్తున్నాడు. తమ్ముడింకా రాలేదు. రోజూ బడి వదలగానే వచ్చేస్తాడు. కానీ ఈరోజు ఎందుకింకా రాలేదు? ఆదుర్దా ఆపుకోలేక వీధిలోకెళ్లాడు. పలక చంకలో పెట్టుకుని ఏడ్చుకుంటూ వస్తున్నాడు వాడు.

"ఏమయింది?" తను ఎదురెళ్లి అడిగాడు పలక చేతిలోకి తీసుకుని.

తనను చూడగానే వాడి ఏడుపు రెట్టింపయింది. సాధారణంగా వాడెప్పుడూ ఏడవడు. అటువంటిది ఇలా ఒక్కసారిగా పెద్దపెట్టున ఏడ్చేసరికి ఏం చెయ్యాలో అర్థంకాలేదు అతనికి.

"ఏం జరిగింది సుధా?" బుజ్జగిస్తూ అడిగాడు.

చాలాసేపటిగ్గానీ వాడు కారణం చెప్పలేదు. "మరే... మరే... మేష్టారు కొట్టారు" వెక్కుతూ చెప్పాడు.

"ఎందుక్కొట్టారు? దెబ్బలు తగిలాయా?" సముదాయిస్తూ అడిగాడు.

సుధాకర్ ఏడుపు ఆపి అరచెయ్యి చూపించాడు. ఎర్రగా వాచి ఉందక్కడ. కదుం కట్టింది.

పసివాడని చూడనన్నా చూడకుండా అంతగా కొట్టినందుకు ఆ మేష్టారిపై కోపమొచ్చింది. కొడితే మాత్రం అంత గట్టిగానా? "ఎందుక్కొట్టారు?" ఆగ్రహంగా ప్రశ్నించాడు తను.

"ఆయనంతట ఆయన కొట్టలేదన్నయ్యా... రమేష్ కొట్టించాడు!" రమేష్‌ని తలుచుకునేసరికి కోపంతో వాడి ముక్కుపుటాలదిరిపోయాయి.

"రమేష్ కొట్టించాడా...ఎందుకు?" అనుమానంతో కనుచూపులు ముడిచాడు.

"వాడి చేతుల్లో మిఠాయి లాక్కున్నానని మేష్టారికి పితిరీలు చెప్పాడు" వాడి కోపం ఇంకా పోలేదు.

"నిజంగా లాక్కున్నావా మిఠాయి?"

"అడిగితే పెట్టలేదు. అందుకే లాక్కున్నాను!"

తనదేం తప్పులేదన్నట్లు, అంతా రమేష్‌దేనన్నట్లు చెప్పాడు సుధాకర్.

చటుక్కున ఏదో గుర్తొచ్చి అన్నాడతను. "ఒరేయ్ సుధా, మధ్యాహ్నం అన్నం తిన్నావా?"

"తిన్నా" తలొంచుకుని చెప్పాడు సుధాకర్.

పొద్దున బియ్యం కొద్దిగానే ఉంటే, రెండుపూటలా సర్దడంకోసం కొద్దిగానే అన్నం వండాడు ఉదయం. మిగతావి రాత్రికి రావాలి. రేపటి సంగతి రేపు చూసుకోవచ్చుననుకున్నాడు. అన్నం కొద్దిగానే వుండటం చూసి దాంతోనే సరిపెట్టుకుని ఉంటాడు తమ్ముడు. తమ బీదరికాన్ని తలుచుకుని దుఃఖం ఆగలేదతనికి. కానీ పెద్దవాడైన తనే ఏడిస్తే ఇంక సుధాకర్‌ని ఓదార్చేవారెవరు? వాడు కొద్దిగా తిండి పుష్టిగలవాడు. ఆకలెక్కువ. అయినా అంత చిన్న వయస్సులోనే పరిస్థితుల్ని అర్థంచేసుకోగల తెలివితేటలున్నాయి. నాకిది కావాలి అది కావాలని పేచీలు పెట్టడు. ఎప్పుడూ గంభీరంగా వుంటాడు.

తన చిన్నారి బుల్లి తమ్ముణ్ణి ఆకలితో మాడ్చాల్సి వస్తోంది. కానీ, ఏం చెయ్యగలడు? తామిద్దరూ ఒక్క గదిలో సర్దుకుని, మిగతా రెండు గదులూ అద్దెకిస్తే వచ్చేది యాభై రూపాయలు. అవి ఎన్ని రోజులొస్తాయి? ఇక పుస్తకాలు బట్టలు వగైరా?

ఇంట్లో ఉన్న విలువగల సామాను ఎప్పుడో బజారుకెళ్లిపోయాయి. పోనీ చదువు మానేసి ఏదన్నా పనిలో చేరితే? ఊహుఁ... అది జనగని పని. తనూ, తమ్ముడూ ఇద్దరూ చదవాలి! నాన్నకిచ్చిన మాట నిలబెట్టుకోవాలి! దృఢంగా అనుకున్నాడు తను.

నాన్న చివరి దశలో తనదగ్గర మాట తీసుకున్న దృశ్యం నిన్నమొన్న జరిగినట్లు కదలాడింది.

★ ★ ★

నాన్నకు ఆరోజు దగ్గు విపరీతంగా వచ్చింది. కళ్లెలో రక్తం కూడా పడింది. దాన్ని చూసి తనకు భయంవేసి బిగ్గరగా ఏడ్చి, "ఈరోజు పనికి వెళ్లకు నాన్నా!" అన్నాడు- పనికి వెళ్లకపోతే తగ్గిపోతుందన్న ఊహతో.

"పనికెళ్లకపోతే తిండెలా బాబూ?" నాన్న ఆయాసంగా అన్నాడు.

"ఒకరోజు పని మానేస్తే ఏమవుతుంది నాన్నా? డాక్టరుకి చూపించుదాం" అన్నాడు తను.

"ఈ రోగానికి డాక్టర్లేం చేస్తారు బాబూ? ఏవో మందులు రాసిస్తారు. బాగా తిండి తినమంటారు. మంచి టానిక్కులు వాడమంటారు. బాగా తిండే వుంటే అసలీ రోగమే ఎందుకొస్తుంది బాబూ?" బలహీనంగా ఉన్న నాన్న గొంతు వణికింది.

వడ్రంగం పనిలో నాన్న మంచి నైపుణ్యం వున్న పనివాడు. అయినా ఆరోగ్యం సరిగా వుండక పోవడంవల్ల రోజూ పని చెయ్యలేకపోతున్నాడు. దానికి తగ్గట్టు ఏదో ఆలోచిస్తూ దిగులుగా వుండేవాడు. అమ్మతమ్ముణ్ణి కని. చనిపోయింది. ఆమె పోయిందగ్గర్నుంచీ ఆయన ఆరోగ్యం మరీ క్షీణించింది. తమ్ముడి ఆలనాపాలనా బాధ్యత తనమీదే పడింది.

"పోనీ ఓ పని చేస్తాను నాన్నా... చదువు మానేస్తాను! వెధవ చదువు. చదవకుంటే ఏం? నీలా గొప్ప పనివాణ్ణవుతాను"అన్నాడు తను ఉత్సాహంగా.

"తప్పు బాబూ... చదువుని అలా దూషించకు". నాన్న బాధపడ్డాడు. "చదువుని మించిన దైవం లేదు. దురదృష్టంకొద్దీ నాకు చదువుకునే అవకాశం దొరకలేదు. మా ఇంట్లో పెద్ద పిల్లాణ్ణవడంచేత మూడో తరగతికే చదువు మానిపించేసి పనిలోకి వెళ్లి కుటుంబాన్ని పోషించాల్సి వచ్చింది!" గతం గుర్తుచేసుకున్నాడు నాన్న.

"అలాగే నేనూ కుటుంబాన్ని పోషిస్తాను నాన్నా!"

ఉత్సాహంగా అన్నాడు తను తిరిగి.

"అలా అనకు బాబూ... చదువు రాకపోవడంవల్ల జీవితంలోనే కోలుకోని దెబ్బతిన్నాను. సంపాదించిందంతా పోగొట్టుకుని మీ భవిష్యత్తును అంధకారం చేశాను. భాగస్వామి చేసిన మోసం తెలుసుకోలేక చివరికిలా ఒక పనివాడిగా మిగిలిపోయాను. మీరు చదవాలి, పైకి రావాలి! నలుగురికీ మీ చదువూ జ్ఞానమూ ఉపయోగపడాలి! అప్పుడే నా ఆత్మకు శాంతి!" కళ్లుమూసుకుని దగ్గుతూనే చెప్పాడాయన. ఎక్కువగా మాట్లాడటం వల్ల పెద్ద దగ్గు తెర వచ్చి, మళ్లీ కళ్లెలో రక్తం పడింది.

"వద్దు నాన్నా, మమ్మల్ని విడిచి వెళ్లకు!" రుద్ధకంఠంతో ఆయన్ని కౌగలించుకున్నాడు తను.

"వద్దు బాబూ... నా దగ్గరకు రాకు! నా రోగం మంచిది కాదు. పాడు రోగమిది. అందరికీ అంటుకుంటుంది!" తనని వదిలించుకుని ఎడంగా జరిగాడాయన.

బిత్తరపోతున్న తనని చూసి, " నువ్వు చదివి, తమ్ముణ్ణి చదివించు. నా బిడ్డలిద్దరూ మంచి చదువులు చదివి గొప్పప్రయోజకులు కావాలి? అదే నా ఆశయం. దాన్ని నీవు నెరవేర్చాలి!" మళ్లీ దగ్గు తెరలు కమ్మివేశాయాయనకు.

"అలాగే నాన్నా... నీ కోరిక తప్పక నెరవేరుస్తాను!" కళ్ల వెంట నీరు కారుతోన్నా, వాగ్దానం చేశాడు తను.

★ ★ ★

ఆనాటి సంఘటన తన కళ్లల్లో మెదిలి మళ్లీ కన్నీరు ధారాపాతంగా వచ్చింది. దాంతో మనసులో గట్టి నిశ్చయం కూడా ఏర్పడింది.

ఏమైనా తండ్రి కోర్కె నెరవేర్చాలి! కానీ చదవాలంటే డబ్బు కావాలి గదా? పుస్తకాలకే ముందుముందు బోలెడవుతుంది. ఏదన్నా పనిచేస్తే ఖాళీ సమయంలో కొద్దిగానైనా సంపాదించవచ్చు. కానీ చదువుకోవడం ఎలా? ఇంట్లో పని? తమకి సాయంచేసేవాళ్లు ఎవరూ లేరు. తనకి తమ్ముడు, తమ్ముడికి తను తప్ప ఎవరూ లేరు ఈ లోకంలో.

ఆ పూటకి అన్నం వండాడు. మరి రేపో? ఇంట్లో అమ్మడానికి కూడా ఖరీదయిన వస్తువులేవీ లేవు. మరి ఎలా? ఆ సమస్య ఇంతింతై ? బ్రహ్మరాక్షసిలా భయపెడుతోంది.

ఏం చెయ్యాలి? రేపెలా గడపాలి? ఇన్ని సమస్యలు ఎదుర్కొంటూ తను చదవగలడా? తమ్ముణ్ణి చదివించగలడా? ఈ పశ్నకి జవాబు చెప్పేవాళ్లు లేరు. ఎక్కడ లేని కోపం వచ్చింది. దాన్ని ఎలాగైనా వ్యక్తం చెయ్యాలనుకున్నాడు.

తనకు చిన్నప్పట్నుంచీ బొమ్మలు గియ్యడమంటే ఇష్టం! ఎప్పుడు ఖాళీ వున్నా బలపంతోనో, సుద్ద ముక్కతోనో ఎక్కడబడితే అక్కడ చిన్న చిన్న పిట్టలు, మొక్కలు, పువ్వులు, లతలు, జంతువులు, బళ్లు - ఇలా రకరకాల బొమ్మలు గీస్తుండేవాడు. నాన్న తన ఆసక్తిని గమనించి రంగుల పెట్టె, కుంచె కొనిచ్చాడు. దాంతో కొండెక్కినంత సంతోషం కలిగింది తనకి. స్కూల్లోకూడా తన బొమ్మలు చూసి డ్రాయింగ్ మేష్టారు మెచ్చుకునేవారు. పెద్ద పెద్ద డ్రాయింగ్ షీట్లమీద దేశ పటాలు, దేశ నాయకుల బొమ్మలు గీయించి స్కూల్లో తగిలించేవాడాయన. నాన్న చనిపోయింతర్వాత ఆ వ్యాసంగమంతా మూలనబడింది.

వెంటనే ఓ డ్రాయింగ్ షీటు తీసుకుని ఎదురుగా కనిపిస్తున్న పటంలోని బుద్ధుడి బొమ్మ గీయసాగాడు. రకరకాల ఆలోచనల నుండి తప్పించుకోవడానికి బొమ్మలు గీయడమొక్కటే తనకున్న మార్గం. అందులోనే తనకానందం!

బొమ్మ గీయడంలో నిమగ్నమయ్యాడు తను. చాలా పొద్దుపోయింది. సమయాన్ని గమనించనే లేదు. తమ్ముడప్పుడే నిద్రపోయినట్లున్నాడు. పట్టుదలగా కూర్చుని చిత్ర రచన పూర్తయ్యేదాకా కదలలేదు తను. తీరా పూర్తయ్యాక చూస్తే తన చిత్రం తనకే ఆశ్చర్యాన్ని కలిగించింది. అంత చక్కగా గియ్యగలడనుకోలేదు. చిత్రం గీశాక తృప్తిగా నిద్రపోయాడు. ఆ రాత్రి అన్నం సంగతే మర్చిపోడు, తమ్ముడితోపాటు తనూ.

మర్నాడు పొద్దున్నే లేచి బొమ్మను చూశాడు. కష్టపడి అంత బాగా గీశాక, ఆ ఆనందాన్ని ఇతరులతో పంచుకోవాలనుకున్నాడు. తమ్ముడింకా నిద్రనుండి లేవలేదు. వాడిని లేపి మరీ చూపించడం ఎందుకు లెమ్మనుకున్నాడు. తమ ఇంటి పక్కనున్న రవి వాళ్ల ఇంటికి బయలుదేరాడు. అతను తన క్లాసే. అతన్ని పిలిచి బొమ్మను చూపించాడు.

రవి ఆ బొమ్మను చూడగానే ఆశ్చర్యపోయాడు. చాలా బాగుందని మెచ్చుకున్నాడు. తన వంక అనుమానంగా చూస్తూ, "నిజంగా నువ్వే వేశావా?" అనడిగాడు.

> ఎదురుగా గోడకు తగిలించి వున్న బుద్ధుడి పటం కనిపించింది. పద్మాసనం వేసుకుని కళ్లుమూసుకుని ఉన్నాడు బుద్ధుడు. లోకంలో తన బోటి వాళ్లు ఇన్ని సమస్యలతో బాధపడుతోంటే ఆయన హాయిగా కూర్చున్నాడు. విసురుగా వెళ్లి ఆ పటం తీసుకుని పగలగొట్టబోయాడు. కానీ చేతులు రాలేదు.

"అవును... నిఝంగా నేనే? ఏం నమ్మకం కలగడం లేదా?" తను గర్వంగా ప్రశ్నించాడప్పుడు.

"అబ్బే, అబద్ధం చెబుతున్నావని కాదు. నిజంగా చాలా బాగుంది!" రవికి ఇంకా నమ్మకం కలగలేదు. కైలాష్ బొమ్మలు గీస్తాడని తెలుసు. కానీ ఇంత బాగా గీయగలడా? అదే అతని అనుమానం. రకరకాల రంగులతో అచ్చులో ఉన్న నిజం బుద్ధుడిలా వున్నదాబొమ్మ.

"నీకు తెలియదుకదూ, మా నాన్నగారు ఎన్నో బొమ్మలు గీస్తుంటారు! కానీ అవేమిటో సాలెగుళ్లలా, వంకర టింకర గీతలతో వుంటాయవి. ఒక్క మంచి బొమ్మవేసి పెట్టమంటే నామాట వినరు!" నిష్ఠూరంగా అన్నాడు రవి బుంగమూతి పెట్టి.

"ఏమిటీ... మీ నాన్నగారు కూడా బొమ్మలు గీస్తారా?" ఆశ్చర్యపోయాడు తను.

"ఓ... ఆఫీసునుండి రావడం ఆలశ్యం. టీ కూడా తాగకుండా బొమ్మలు మొదలెడతారు!" చెప్పాడు రవి. తిరిగి వాడే తన వంక ఆశగా చూసి, "ఈ బొమ్మ నాకు బాగా నచ్చింది. ఇది నాకిస్తే నిన్ను సినిమాకి తీసుకెడతాను!" అన్నాడు.

వాడి దగ్గర ఎప్పుడూ డబ్బులు గలగల లాడటం తనకు తెలుసు. బళ్లో కూడా ఇంటర్వెల్‌లో డబ్బులతో అవీ ఇవీ తెగ కొని తింటుంటాడు. మధ్యాహ్నం అప్పుడప్పుడూ పిరియడ్లు కూడా ఎగ్గొట్టి సినిమాలకు చెక్కేస్తూంటాడు కూడా.

ఇంత కష్టపడి తను బొమ్మ గీస్తే తీరా వాడు తనకిమ్మనేసరికి ఒక్క క్షణం ఏంచెప్పాలో అర్థం కాలేదు. "నీకా? అదేం కుదరదు. ఎంతో కష్టపడి వేసింది నీకివ్వడానికేనా? ఇటిచ్చెయ్... జాగ్రత్త నలిగిపోతుంది!" దాన్ని వాడు గట్టిగా పట్టుకోవడం చూసి విలవిల లాడిపోయాడు తను.

"ప్లీజ్... నాకివ్వవా? నీకేం కావల్సివస్తే అదిస్తా. ఒక్కడికి కాకపోతే నిన్నూ, నీ తమ్ముడినీ సినిమాలకి తీసికెడతా... ఒకటి కాదు... రెండు సినిమాలకు?" ఊరించాడు రవి.

"అబ్బే, అదేం కుదరదు. మాకూ సినిమాలకూ ఆమడ దూరం. అయినా ఫ్రెండువి కదా అని చూపించుదామని తెస్తే, అచ్చం ఇచ్చెయ్యమంటావేమిటి?" అసహనంగా తను దాన్ని లాక్కోబోయాడు.

"తీసుకో చూద్దాం..." ఇంట్లోకి పరిగెత్తాడు రవి.

తనకేం చెయ్యాలో అర్థంకాలేదు. లోపలికెడితే ఏమనుకుంటారోనని జంకు కలిగింది. బయటనుంచే "రవీ...రవీ" అంటూ గట్టిగా పిలిచాడు. ఒకటికి నాలుగు సార్లు పిలిచినా, రవి రాలేదు గానీ, వాళ్ల నాన్నగారొచ్చారు. ఆయన బయటకొచ్చినప్పటి అవతారాన్ని చూస్తే భలే నవ్వు వచ్చింది. గడ్డం గీసుకుంటూ సగంలో బయటికొచ్చాడాయన. షేవింగ్ క్రీమ్ సగం చెంపకలాగే వుంది. నవ్వునాపుకుని జరిగిన సంగతంతా చెప్పాడు ఆయనతో.

"ఇప్పుడే కనుక్కుంటాను బాబూ!"అంటూ ఆయన అక్కడినుండే కొడుకును గట్టిగా కేకేశాడు.

రవి బిక్కుబిక్కుమనుకుంటూ అక్కడికొచ్చాడు. వాడి చేతుల్లో బొమ్మ లేకపోవడాన్ని ఆయన చూసి, "కైలాష్ గీసిన బొమ్మ ఏది?"అంటూ గద్దించి అడిగాడు. వాడు భయంతో అటూ ఇటూ చూస్తూ నిలబడ్డాడు. తండ్రి బొమ్మను తీసుకురమ్మని తిరిగి గద్దించేసరికి, లోపల దాచిన డ్రాయింగ్ షీట్‌ని తీసుకొచ్చి తండ్రికిచ్చాడు. ఆయన దాన్ని తీసుకుని పరిశీలనగా చూశాడు. "చాలా బాగుంది. నువ్వే వేశావా?" మెచ్చుకుంటూ అడిగాడాయన.

తను ఔనని తలూపగానే, ఆయన బొమ్మను తనకివ్వబోయాడు.

అప్పుడు తను బిక్కమొహం పెట్టిన రవిని చూసి, "పోనీ లెండి. దాన్ని రవినే ఉంచుకోనివ్వండి"అంటూ తిరిగి ఆయనకే ఇచ్చేశాడు. తిరిగి తను ఇంటికి వచ్చేస్తోంటే ఆయన వెనక్కి పిలిచాడు. ఇంట్లోకి రమ్మని తన గదిలోకి తీసికెళ్లాడు. గోడలమీదున్న కొన్ని బొమ్మల్ని చూపించి, "అవి నేను గీసిన బొమ్మలు. ఎలా వున్నాయి?" ప్రశ్నించాడాయన.

ఆ బొమ్మలు తనకు తెలిసిన మనుషుల బొమ్మలో, చెట్లు, జంతువుల బొమ్మలో కాదు. ఏవో గజిబిజి ఆకారాల్లో ఉన్నాయవి. కానీ ఆ రేఖలు, రంగులు ఎంతో అద్భుతంగా ఏదో తనకు తెలియని అర్థాన్ని కలిగి వున్నట్లు కనిపిస్తున్నాయి. తన అభిప్రాయాల్ని కనిపెట్టినట్లు ఆయన "ఇవి ఒక ప్రత్యేక పద్ధతిలో వేసిన పెయింటింగ్స్. వీటిని ఇంగ్లీషులో 'ఆబ్‌స్ట్రాక్టు ఆర్ట్'అంటే 'నైరూప్య చిత్రకళ'అని తెలుగులో అంటారు. నువ్వు చిన్నవాడివి కదా! ఈ చిత్రాలలోని భావం నీవింకా అర్థం చేసుకోలేవు" అన్నాడాయన విడమర్చి చెబుతూ.

తనకు అక్కడినుండి కదలబుద్ధి పుట్టలేదు. వాటివంకే చూస్తూ నిలబడ్డాడు. తను కూడా ఎప్పటికైనా అంత అద్భుతంగా వెయ్యగలడా అనిపించింది.

(మిగతా 12వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

ఆయన తన వైఖరి గమనించాడు. కూర్చోమని చెప్పి ఆత్మీయంగా తన భుజం మీద చెయ్యివేసి అన్నాడు "చూడు కైలాష్! మీ కుటుంబ పరిస్థితులు విన్నాను. నీ పట్టుదల దీక్ష నాకాశ్చర్యమనిపించాయి. నువ్వు చదువుతూ, నీ తమ్ముణ్ణి చదివిస్తూ, ఇంత చిన్నతనంలోనే పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కొంటూండటం నాకు నిజంగా నమ్మశక్యం గావడంలేదు. చదువులో కూడా నీకు ఫస్టు మార్కులొస్తాయని మా అబ్బాయి చెప్పాడు. వీటన్నిటికీ తోడు చిత్రలేఖనంలో ఎంతో ప్రతిభ వుంది నీకు. నిన్ను మెచ్చుకోలేకుండా ఉండలేకపోతున్నాను!"

నాన్న చనిపోయాక ఇంత చల్లని మాటలు మాట్లాడిన వాళ్లు లేరు. ఆ మాటలకు తన కళ్ల వెంట నీళ్లు తిరిగాయి. ఆయనకవి కనిపించడం ఇష్టంలేక పక్కకు తిరిగి రహస్యంగా కళ్లు తుడుచుకున్నాడు తను.

ఇదంతా గమనించనట్టున్నాడాయన తిరిగి "నీకు లభించిన ఈ చిత్ర కళాశక్తి ఓ వరమనుకో. దీన్ని వదలకు. బాగా అభ్యాసం చెయ్యి. నీ తీరిక సమయాన్ని ఇందుకోసం వినియోగించు. కనీసం రోజుకో గంట దీని కోసం ప్రత్యేకించు. ఇందులో ఎంతో భవిష్యత్తు ఉంది. నీకు కావలసిన సూచనలు సలహాలు నేనిస్తాను. నీ చదువుని నిర్లక్ష్యం చెయ్యకుండా దీన్ని అభ్యసించావంటే నీ చదువుకి కావలసిన డబ్బునికూడా ఇదే సమకూరుస్తుంది. నీకేది కావలసినా నన్నడుగు. నిన్ను నా రవితో పాటు మరో బిడ్డగా భావిస్తున్నాను" ధైర్యం చెప్పాడాయన.


ఆయన ఆ మాటలే తన భవిష్యత్ గమనాన్ని నిర్దేశించాయి. అప్పటినుండి తనూ చదువుతోపాటు చిత్రకళ కూడా ఓ తపస్సులా అభ్యసించాడు. రవి వాళ్ల నాన్న దగ్గర చిత్రలేఖనంలోని వివిధ పద్ధతులు, వివిధ రంగుల మేళవింపు, ఆయిల్ పెయింటింగు, వాటర్ పెయింటింగులలో పాటించాల్సిన మెలకువలు, వివిధ రకాల కాన్వాస్‌ల వాడకం, బ్రష్‌ల తీరుతెన్నులు అన్నీ ఆయన తనకు వివరించి చూపించేవాడు. చిత్రలేఖనం మీద ఎన్నో పుస్తకాలు చదివించాడాయన. వివిధ దేశాల చిత్రకళారీతులు, వాటి చరిత్ర గురించి స్కూలు పుస్తకాలతోపాటు చదివాడు తను. ఆయన ఓ పత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్నాడు. ఆ పత్రికలో పిల్లల కథలకు తన చేత బొమ్మలు కొన్ని వేయించాడు. దాని ద్వారా కొంత డబ్బుకూడా వచ్చింది. దీంతోపాటు చిన్న చిన్న చిత్రాలు దేవీ సెంటర్ దగ్గరున్న రెండు మూడు షాపులలో ఇచ్చి, ఆ షాపుకాల్లిచ్చే చిన్న చిన్న మొత్తాలు పుచ్చుకోవడం చేస్తూ వచ్చాడు. ఇంతలో రవి వాళ్ల నాన్నగారు హఠాత్తుగా గుండెపోటు వచ్చి చనిపోయారు. దాంతో పెద్ద అండ కోల్పోయినట్లయింది తనకు. రవి, వాళ్ల అమ్మ తాతగారింటికి విశాఖపట్నం వెళ్లిపోయారు. ఆయన చనిపోయినా, ఆయన వేసిన బాటలోనే తను నడుస్తున్నాడు. అద్దె ద్వారా చిత్రాల ద్వారా వచ్చే కొద్దిపాటి డబ్బుతోనే తనూ తమ్ముడూ నెట్టుకొస్తున్నారు. పత్రికతో సంబంధాలు తెగిపోయినా మార్గం అదే.

మొదటిసారిగా ఓ చిత్రం అమ్మగా రెండు రూపాయలొచ్చింది. కష్టపడి వేసిన చిత్రం అది. వచ్చింది మాత్రం రెండు రూపాయలు. ఒక రోజు కూలీకన్నా తక్కువ. అయినా స్వంత సంపాదన ఇచ్చే ఆనందం వేరు. కళ యొక్క విలువ ఆంధ్ర దేశంలో కూలీకన్నా తక్కువ స్థాయిలో వుంది. ఆ డబ్బు తీసికెళ్లి తను సుధాకర్ చేతిలో పెట్టాడు.

"ఏమిటన్నయ్యా?" వాడు అర్థంగాక అడిగాడు.

"మిఠాయిలు కొనుక్కు తిను... వెళ్లు... నీక్కావలసింది కొనుక్కో!" ఇంక నువ్వు ఎవరి దగ్గరా లాక్కోవాల్సిన అవసరం లేదు. ఎవరితోనూ దెబ్బలు తినే పని లేదు... వెళ్లు... త్వరగా వెళ్లు!" అన్నాడు తను గద్గద స్వరంతో. దారిద్ర్యం తాలూకు అభిమానంతో తన కళ్లనుండి కన్నీటి చుక్కలు జలజలా రాలాయి.

ఆ కన్నీటిని చూసి సుధాకర్ బావురుమని ఏడ్చాడు తనని కౌగలించుకుని.



రవి బిక్కుబిక్కు మనుకుంటూ అక్కడికొచ్చాడు. వాడి చేతుల్లో బొమ్మ లేకపోవడాన్ని ఆయన చూసి, "కైలాష్ గీసిన బొమ్మ ఏది?" అంటూ గద్దించి అడిగాడు. వాడు భయంతో అటూ ఇటూ చూస్తూ నిలబడ్డాడు. తండ్రి బొమ్మను తీసుకురమ్మని తిరిగి గద్దించేసరికి, లోపల దాచిన డ్రాయింగ్ షీట్‌ని తీసుకొచ్చి తండ్రికిచ్చాడు. ఆయన దాన్ని తీసుకుని పరిశీలనగా చూశాడు. "చాలా బాగుంది. నువ్వే వేశావా?" మెచ్చుకుంటూ అడిగాడాయన.

కన్నీటికి విలువెంత? ఏ ఆర్థికవేత్త అయినా, ఏ వ్యాపారదక్షుడైనా, ఏ షరాబైనా ఆనాటి తమ ఇద్దరి కన్నీటికి విలువ కట్టగలరా? దుఃఖానికీ సంతోషానికీ కూడా ఒకే కన్నీరే వస్తాయంటారు కవులు! అటువంటప్పుడు ఆ రెంటి విలువా ఒకటేనా? ఎన్నోసార్లు తన కన్నీటిని మనసులోనే దాచుకున్నాడు. తమవంటివారి కన్నీరు చూసి ఈ లోకం సానుభూతి చూపించదు సరికదా, చేతగాని వాళ్లని తేలిగ్గా ఈసడిస్తుంది! కానీ ఆ రోజు తనూ, తన తమ్ముడూ కలిసి పంచుకున్నప్పటి దుఃఖం తన జీవితంలో ఎప్పటికైనా మరచిపోగలడా?

తనిచ్చిన డబ్బుని తనకే తిరిగిచ్చేశాడు సుధాకర్. "వద్దన్నయ్యా... మిఠాయి వద్దు. అన్నం తిందాం! అన్నం తింటే కడుపు నిండుతుంది. మిఠాయిలతో కడుపులు నింపుకునే వాళ్లు లేరు. మనకు అన్నం వుంటే చాలు!" అన్నాడు వాడు.

అటువంటి సున్నిత హృదయుడు తన సుధాకర్... తను బొమ్మలు గీస్తుంటే కళ్లు పెద్దవి చేసుకుని ఆనందంతో చూసే సుధాకర్... తన చిత్ర లేఖనాన్ని మెచ్చుకుంటూ తన వెన్నుతట్టి ప్రోత్సహించిన సుధాకర్... తనని అంటిపెట్టుకునే ఎప్పుడూ తిరుగుతూండే సుధాకర్... ఎప్పుడూ ఆలోచిస్తూ అల్లరనేది చేయడం ఎరగని సుధాకర్... మేష్టర్లందరిచేతా మెప్పులు పొందిన సుధాకర్... ఎప్పుడూ ఏవేవో ప్రశ్నలువేస్తూ తనను వేధించే సుధాకర్... నేను బొమ్మలు గీయడానికి వెసులుబాటు కల్పించడంకోసం తను ఇంట్లో పనులన్నీ చక్కబెట్టిన సుధాకర్... తనకున్న ఒకే ఒక్క తమ్ముడు సుధాకర్- ఒకనాడు అకస్మాత్తుగా ఇంటి నుండి అదృశ్యమయ్యాడు. ఎనిమిదో తరగతి చదువుతూ చదువుతూనే ఇంటి నుండి వెళ్లిపోయాడు!

వాణ్ణి గురించి ఎంతని వెదికాడు తను! పోలీసులకు రిపోర్టిచ్చాడు. రేడియోలో ప్రకటింపజేశాడు. చుట్టుపక్కలున్న ఊళ్లన్నీ వెతికాడు. కనిపించిన వాడినల్లా అడిగాడు. అయినా వాడి జాడ తెలియరాలేదు. తన చిన్నారి తమ్ముడు, తన ప్రాణంఅయిన సుధాకర్ తిరిగి రాలేదు.

ఒక రోజు ఏదో పనిమీద అల్మైరా వెదుకుతూంటే, ఓ కాగితం కనబడింది. అది ఇంటినుండి వెళ్లే సమయంలో సుధాకర్ రాసిన ఉత్తరం! ఆత్రంగా చదివాడు తను.

"అన్నయ్యా!"

నీ చిన్నారి తమ్ముడు నిన్ను విడిచి వెడుతున్నాడు. ఎందుకో తెలుసా? తన స్వార్థం చూసుకోవడానికి కాదు. ఈ సమాజాన్ని మరమ్మత్తు చేద్దామని!

నీలాగే నాకూ దేవుడంటే నమ్మకం లేకపోయినా, నిన్నే దేవుడిగా భావించాను. లోకంలో ఇంతకంటే దేవుడుంటాడా? బళ్లో నాతోపాటు వందలాది మంది చదువుకుంటున్నారు కదా! అయితే అందరూ కులాసాగా సంతోషంగా ఆడుతూపాడుతూ హాయిగా చదువుతూంటే, కొందరేమో రేపెలా గడవడం అనే సమస్యతో సతమతమవుతూ చదువుతున్నారు.

ఒకనాడు నేను రమేష్ మిఠాయి లాక్కుని తింటే, అలా లాక్కోకూడదన్నావు. లాక్కోకపోతే అది నాకు రాదే! రమేష్ లాంటి వ్యక్తులు మనచుట్టూ విషపు పడగలు విప్పుకుని ఉన్నారు. ఈ విషపు పడగల్ని తుంచడానికి, మేష్టారిలాంటి వాళ్లని వంచడానికి నేను వెడుతున్నాను. అదే నా ఆశయం. లక్ష్యం, సంకల్పం!

దాన్ని సాధించడంకోసం నా ప్రాణాలయినా తృణప్రాయంగా అర్పిస్తాను. ఎప్పుడైనా సుధాకర్ అనే తమ్ముడొకడున్నాడని జ్ఞాపకానికి వస్తే అదే చాలు. నా కోసం చింతించకు.

- నీ తమ్ముడు

సుధాకర్"!

తనకు ఆ ఉత్తరం ఒక పిడుగుపాటుగా అనిపించింది. కళ్లలో ఆవిరులు కక్కించింది. ఒక్కసారిగా నిస్త్రాణంగా కూలబడిపోయాడుతను. నవనాడులూ కుంగిపోయాయి. జీవితానికి అర్థం ఇంకేముంది అనిపించింది. ఇప్పటిదాకా సుధాకర్ ఇవ్వాళో రేపో వచ్చేస్తాడు అనే ఆశ. ఏమూలో మినుకు మినుకు మంటూండేది. ఇప్పుడది కూడా లేకుండా పోయింది.

"ఈ రోడ్డేనా బాబూ మీరన్నది... లేక పైరోడ్డా?" రిక్షా తాత ప్రశ్నకు ఈ లోకంలోకి వచ్చాడు కైలాష్. ఇంకా తమ్ముడి జ్ఞాపకాల వేడి నుండి తేరుకోలేదతను. దాంతో చుట్టూ చూశాడు. ముందు తానెక్కడున్నదీ అర్థంకాలేదు.

మరి నాలుగడుగులు రిక్షాపోయాక నేతాజీ బొమ్మ కనిపించింది రోడ్డు మధ్యలో. "అరె, దాటిపోయాం తాతా! ఇక్కడాపు... నేనడిచిపోతాను!" చెమర్చిన కళ్లని తుడుచుకుంటూ, రిక్షా తాతకు డబ్బులిచ్చి కిందికి దిగాడు కైలాష్.

★